ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 మహబూబాబాద్
ఆదివారం 27 అక్టోబరు 2024







మత్తు పదార్థాలతో చిత్తవుతున్న యువత : డీఎంహెచ్‌వో మురళీధర్

మరిపెడ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మత్తు పదార్థాలతో యువత తమ జీవితాలను చిత్తు చేసుకుంటున్నారని డీఎంహెచ్‌వో మురళీధర్ ఆవేదన వ్యక్తం చేశారు. మరిపెడ పీహెచ్‌సీలో శనివారంఆయన మద్యం, మాదకద్రవ్యాల నిషేధ అవగాహన పోస్టర్లను ఆవిష్కరించి, మాట్లాడారు. నేటి యువత గంజాయి, డ్రగ్స్‌కు అలవాటు పడి భవిష్యత్తును పాడు చేసుకుంటున్నారని, వాటిని సేవించడంతో కిడ్నీ, గుండె జబ్బులతో పాటు మతిమరుపు వ్యాధుల బారిన పడుతున్నట్లు చెప్పారు. తల్లిదండ్రులు యుక్తవయస్సున్న పిల్లలపై ప్రత్యేక నజర్ పెట్టాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో మండల్ మెడికల్ ఆఫీసర్ రవి, ఇన్‌చార్జి డీపీహెచ్‌ఎన్ మంగమ్మ, నర్సింగ్ సూపరింటెండెంట్ విజయలక్ష్మి, ఫార్మసిస్టులు సోములు, అనిత, స్టాఫ్‌నర్స్‌లు సుజాత, స్వర్ణ, ఏఎన్ఎం హరీశ పాల్గొన్నారు.



ఖిలావరంగల్ మధ్యకోటలోని శిల్పాల ఆవరణ


విద్యుత్ వెలుగుల్లో ఖుష్ మహల్

కాకతీయ కాలం నాటి అద్భుత శిల్పసంపదకు నెలవు ఓరుగల్లు. కాలక్రమేణా కనుమరుగవుతున్న కళాసంపదను పూర్వరూపంలోనే భావితరాలకు అందించేలా పురావస్తుశాఖ చర్యలు చేపట్టింది. రసాయనిక చర్యలతో గతంలో ఉన్న కళారూపాలు చెక్కుచెదరకుండా వాటిని పరిశుభ్రం చేసి నూతనత్వాన్ని ఆపాదింపజేశారు. అలా ఒకటి కాదు.. రెండు కాదు.. ఖిలావరంగల్ పడమర, మధ్య, తూర్పుకోటలతో పాటు శివారు ప్రాంతాల్లో ఉన్న బోలెడంత శిల్పసంపదకు నూతన సొబగులు అద్దారు. మధ్యకోటలోని దేవాలయాలు, నిర్మాణాలు, కట్టడాలు, శిల్పసంపదలు, శత్రురాజుల చేతుల్లో చెల్లాచెదురై మట్టి దిబ్బలుగా పడిఉన్న కోట సుందరంగా తీర్చిదిద్ది పునఃప్రతిష్ఠ కోసం సిద్ధమవుతోంది. అంతేకాదు ముమ్ముందు మరికొన్ని వందల సంవత్సరాలు చెక్కుచెదరకుండా కాపాడేలా కేంద్ర పురావస్తుశాఖ ఓ డీపీఆర్‌ను కూడా సిద్ధం చేసింది. ఇప్పటికే పలు అభివృద్ధి, సుందరీకరణ పనులతో వరంగల్ కోటకు సందర్శకుల సంఖ్య పెరుగుతోంది.

- ఖిలా వరంగల్



ఫిబ్రవరిలో మేడారం మినీజాతర

- 12వ తేదీ నుంచి 15వరకు నిర్వహణ
- ప్రకటించిన పూజారులు

మేడారం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తాడ్వాయి మండలం మేడారం వనదేవతలుగా ప్రసిద్ధి చెందిన సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల మినీ జాతరకు పూజారులు తేదీలను అమ్మవార్ల గద్దెల ప్రాంగణంలో శనివారం ఖరారు చేశారు. అమ్మవార్ల ప్రాంగణంలో పూజారులు సమావేశమై మాఘశుద్ధ పౌర్ణమి గడియలను పరిశీలించి 2025 ఫిబ్రవరి 12వ తేదీ నుంచి 15వ తేదీ వరకు నాలుగు రోజుల మినీ సంబురం జరపనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా 2025 ఫిబ్రవరి 12 బుధవారం ప్రథమ పూజలు మండె మెలుగు కార్యక్రమం, గ్రామంలోని దేవాలయాలు శుద్ధి చేసి ప్రత్యేక పూజలు చేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా రక్షతోరణాలు, ద్వారబంధాలు వంటి కార్యక్రమాలు చేయనున్నట్లు తెలిపారు. 2025 ఫిబ్రవరి 13 గురువారం రహస్య పూజలు 14 శుక్రవారం, 15 శనివారాల్లో ప్రత్యేక రహస్య పూజా కార్యక్రమాలు చేసి మినీ జాతరను ముగించనున్నమన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి వనదేవతల మొక్కులు చెల్లించుకోవాలని తెలిపారు. ఈ తేదీలను దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులకు తెలియజేశామన్నారు. ఈ కార్యక్రమంలో పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, ఉపాధ్యక్షుడు కాక సారయ్య, సంఘం సభ్యులు కొక్కెర కృష్ణయ్య, పూజారులు సిద్దబోయిన అరుణ్, కొక్కెర రమేష్, సిద్దబోయిన బోజరావు, సిద్దబోయిన రమేష్, కాక కిరణ్, కాక అమృత, సిద్దబోయిన మునిందర్, అభ్యుదయ యువజన సంఘం నాయకులు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.


తేదీలను ఖరారు చేస్తున్న పూజారులు

అల్పాహారం అటకెక్కినట్టేనా?

- ఎన్నికల స్టంట్‌గా మారిన నాటి సీఎం బ్రేక్‌ఫాస్ట్ స్కీం
- పైలెట్ ప్రాజెక్టుతోనే పరిసమాప్తమా!
- జిల్లాలో పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోని రాగి జావ

బయ్యారం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : బుజ్జీ స్కూల్‌కి టైం అవుతుంది తొందరగా టిఫిన్ చేద్దువురా.. వద్దమ్మా మా స్కూళ్లో అల్పాహారం ఏర్పాటు చేశారు.. అరే నాన్న బూస్ట్ తాగి వెళ్లు ఎనర్జి వస్తుంది.. వద్దు మా బళ్లో రాగిజావ ఇస్తున్నారు. ఇది ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పిల్లల్లో కొద్ది రోజుల పాటు నెలకొన్న అభిప్రాయం. కానీ, ప్రస్తుత పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అసెంబ్లీ ఎన్నికల ముంగిట ఆర్భాటంగా ప్రారంభించిన 'సీఎం బ్రేక్ ఫాస్ట్ కార్యక్రమం' ఎన్నికల స్టంట్‌ను తలపిస్తుండటంతో ఇక ప్రభుత్వ బడుల్లో అల్పాహారం అటకెక్కినట్టేనా..?! అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం మారటంతో పైలెట్ ప్రాజెక్టుతోనే ఈ కార్యక్రమం పరిసమాప్తమా అన్న అనుమాలు లేకపోలేదు. దీనికితోడు రాగిజావ జాడ కూడా పూర్తిస్థాయిలో కన్పించకపోవడంతో గవర్నమెంట్ స్కూల్ విద్యార్థులు నిరాశ చెందుతున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి..

జిల్లాలో 85 స్కూళ్లలో అమలు..

మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా 858 ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తం 41,881 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఇందులో 109 ఉన్నత పాఠశాలల్లో 13,707 మంది, 119 ప్రాథమికోన్నత పాఠశాలల్లో 7632 మంది, 620 ప్రాథమిక పాఠశాలల్లో 20,541 మంది చదువుతున్నారు. అయితే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పిల్లలకు మధ్యాహ్నభోజనంతో పాటు ఉదయం అల్పాహారం కూడా ఏర్పాటు చేయాలని భావించిన నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం గత ఏడాది అక్టోబర్ 06న ఈ కార్యక్రమాన్ని ప్రారంభించింది. తొలుత పైలెట్ ప్రాజెక్టు కింద నియోజకవర్గానికి రెండు స్కూళ్ల చొప్పున ఎంపిక చేసి, క్రమేపి జిల్లా వ్యాప్తంగా 85 పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని కొనసాగించారు. అల్పాహారం కింద విద్యార్థులకు వారంలో ప్రతీరోజు గోధుమ రవ్వ చట్నీ, అటుకుల పులిహోర, ఉప్మా సాంబర్, పొంగలి సాంబర్, ఇడ్లీ, బోండా చెట్నీ వడ్డించారు. మధ్యాహ్న భోజన వర్కర్లే అల్పాహారాన్ని తయారు చేసి, పిల్లలకు పెట్టేవారు. ఈ క్రమంలోనే అసెంబ్లీ ఎన్నికలు వచ్చి ప్రభుత్వం మారడంతో సీఎం బ్రేక్‌ఫాస్ కార్యక్రమానికి బ్రేక్ పడింది. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 10 నెలలు పూర్తయినా నేటికి పాఠశాలల్లో అల్పాహారం ఊసే ఎత్తకపోవడంతో పాటు కనీసం రాగి జావను కూడా పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడంపై విద్యార్థుల్లో అసంతృప్తి నెలకొన్నది.


విద్యార్థులకు వడ్డిస్తున్న అల్పాహారం (ఫైల్)

బిల్లులూ పెండింగ్‌లోనే..?

గత ప్రభుత్వ హయాంలో సుమారు రెండునెలల పాటు కొనసాగిన ఈ కార్యక్రమానికి సంబంధించిన బిల్లులూ పెండింగ్‌లోనే ఉన్నట్లు తెలుస్తుంది. ఎన్నికల ముంగిట కార్యక్రమాన్ని ఆర్భాటంగా ప్రారంభించిన గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అందుకు తగ్గట్టుగా బడ్జెట్ విడుదల చేయకపోవడంతో నిర్వాహణ బాధ్యత పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయులకు అప్పగించినట్లు సమాచారం. దీంతో హెచ్‌ఎంలే వ్యయ ప్రయాసాలకోర్చి కార్యక్రమం కొనసాగించినప్పటికి అనంతరం కొద్ది కాలానికే ప్రభుత్వ మారి కార్యక్రమం నిలిచిపోవడంతో పలు పాఠశాలల్లో అల్పాహారం బిల్లులు నేటికి పెండింగ్‌లోనే ఉన్నట్లు తెలుస్తుంది.

అల్పాహారం కొనసాగించాలి..

- రక్షిత, 9వ తరగతి, ఉప్పలపాడు ఉన్నత పాఠశాల



మధ్యాహ్నభోజనంతో పాటు పాఠశాలల్లో అల్పాహారం కూడా కొనసాగించాలి. దాంతో పాటు రాగి జావ కూడా ఇస్తే బాగుంటుంది. రాగిజావ వల్ల కొంచెం యాక్టీవ్‌గా ఉండి చదువుపై శ్రద్ధ పెట్టడానికి ఆస్కారం ఏర్పడుతుంది. అల్పాహారం కొనసాగిస్తే పేద కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

పస్తులతోనే పాఠశాలకు వస్తున్నాం..

- విజయ్‌కుమార్, 9వ తరగతి, ఆలేరు ఉన్నత పాఠశాల



పేరెంట్స్ పొద్దున్నే పనులకు వెళ్లే బిజీలో ఉంటుండటంతో చాలాసార్లు పస్తులతోనే బడికి రావాల్సి వస్తుంది ఒకటి, రెండు పిరియడ్స్‌కే నీరసం వచ్చేది. కళ్లు తిరిగి నట్లై పలుమార్లు క్లాస్‌రూమ్‌లో పాఠాలు సరిగ్గా వినకపోయేది. పోషక విలువలతో కూడిన అహారం అందిస్తే విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

వ్యవసాయ విద్యార్థినుల క్షేత్ర సందర్శన

- మేఘాలయ పసుపు సాగు పరిశీలన

కేసముద్రం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : తాళ్లపూసపల్లిలో సొల్లేటి జైపాల్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రాన్ని వరంగల్ వ్యవసాయ కళాశాల బీఎస్సీ అగ్రికల్చర్ (హానర్స్) నాలుగో సంవత్సరంవిద్యార్థినులు రూరల్ అగ్రికల్చర్ వర్క్‌ఎక్స్‌పీరియన్స్ ప్రోగ్రాం (ఆర్‌ఏడబ్ల్యూఈపీ)లో భాగంగా శనివారం సందర్శించారు. షేడ్‌నెట్‌లో బిందుసేద్యం కింద గోబ్యాక్ పద్ధతిలో ఎలాంటి మన్నులేకుండా కోకోపిట్, వర్మీకంపోస్టును ఉపయోగించి మేఘాలయ నుంచి తీసుకువచ్చి 'లగాడం' రకం పసుపు సాగును విద్యార్థులు పరిశీలించారు. పాలిథిన్ మల్చింగ్ కింద సాగు చేస్తున్న మిర్చి పంటను సందర్శించి సేంద్రియ సాగుపై జైపాల్‌రెడ్డి, పెండెం వెంకన్నల నుంచి వివరాలు సేకరించారు. విద్యార్థినులు పి.అంజలి, బి.చరిత, బి.దీప్తి, ఎస్.జ్యోతి, వి.నందినిగంగోత్రి, పి.పూజిత పాల్గొన్నారు.


తాళ్లపూసపల్లిలో మేఘాలయ పసుపు సాగును పరిశీలిస్తున్న విద్యార్థినులు

మత్స్యకారులకు అండగా ప్రభుత్వం

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

తొర్రూరు రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మత్స్యకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడు అండగా ఉంటుందని పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. అమ్మాపురం పెద్ద చెరువులో 50వేల చేపపిల్లలు, హరిపిరాల చెరువులో 1.29లక్షల చేప పిల్లలను శనివారం పోశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో మాట్లాడుతూ మత్స్యకారులు ఆర్థికాభివృద్ధి సాధించాలనే సంకల్పం తో ప్రభుత్వం పని చేస్తుందన్నారు. వందశాతం సబ్సిడీపై మత్స్యకారులు అంద జేసిన చేపల ఉత్పత్తి గణనీయంగా పెంచి ఆర్థిక పరిపుష్టి సాధించాలని సూచించారు. వ్యవసాయ మార్కెట్ చైర్మన్ తిరపతిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హమ్యానాయక్, మండల పార్టీ అధ్యక్షుడు సుంచు సంతోష్, అచ్చిరెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు జగన్, అశోక్, మత్స్యసంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

పట్టణ అభివృద్ధికి కృషి చేస్తా

తొర్రూరు (ఆంధ్రజ్యోతి) : తొర్రూరు మునిసిపాలిటీ అభివృద్ధికి అన్నివిధాల కృషి చేస్తానని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. తొర్రూరులో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలకు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మునిసిపాలిటీని అభివృద్ధి చేసేందుకు మరిన్ని నిధులు మంజూరు చేయిస్తామని తెలిపారు. టీఎస్ఎఫ్ఐడీసీ నుంచి మంజూరైన నిధుల నుంచి స్వామి వివేకానంద, మైత్రి వెల్ఫేర్, కమ్యూనిటీ హాల్ నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. మండలంలోని అమర్‌సింగ్ తండా గ్రామస్థులు తండాలో నెలకొన్న ఇబ్బందులను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. రైతువేదిక ఆవరణలో కార్మికశాఖ ఆధ్వర్యంలో నేషనల్ అకాడమీ కన్‌స్ట్రక్షన్ వారిచే శిక్షణ పొందుతున్న భవన నిర్మాణ కార్మి కులకు యూనిఫామ్‌లు, హెల్మెట్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతుందని వాటిని వినియోగించుకోవాలన్నారు. మునిసిపల్ చైర్మన్ రాంచంద్రయ్య, వైస్‌చైర్మన్ జినుగ సురేందర్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ హనుమాండ్ల తిరుపతి రెడ్డి, సోమరాజశేఖర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హనుమకొండ, వరంగల్ జిల్లాల పరిధి పెంపు

- ములుగు గిరిజన యూనివర్సిటీకి భూమి కేటాయింపు
- ఏటూరునాగారం రెవెన్యూ డివిజన్ ఏర్పాటు
- రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం

హనుమకొండ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర మంత్రి వర్గ సమావేశంలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించి పలు కీలక నిర్ణయాలు జరిగాయి. శనివారం సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల ప్రస్తుత పరిధిని మరింత పెంచాలని నిర్ణయం తీసుకున్నారు. అయితే ఎటు నుంచి ఏఏ మండలాలను కలపడం ద్వారా ఈ రెండు జిల్లాల పరిధిని పెంచుతారనే విషయంలో స్పష్టత రాలేదు. కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయం ప్రకారం రెండు మండలాలను కలపడం ద్వారా హనుమకొండ జిల్లా, రెండు లేదా మూడు మండలాలను కలపడం ద్వారా వరంగల్ జిల్లా పరిధిని పెంచే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఇక ములుగు జిల్లాలో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన సమ్మక్క సారలమ్మ గిరిజన విశ్వవిద్యాలయానికి 211 ఎకరాల స్థలాన్ని కేటాయిస్తూ మంత్రి మండలి సమావేశం నిర్ణయించింది.

అలాగే ఏటూరునాగారాన్ని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తూ కూడా కేబినెట్ నిర్ణయం తీసుకుంది. సమావేశం అనంతరం మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్ విలేకరుల సమావేశంలో ఈ నిర్ణయాలను వెల్లడించారు.

అన్నివర్గాల అభివృద్దే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే మురళీనాయక్

నెల్లికుదురు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : అన్నివర్గాల అభివృద్దే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. నెల్లికుదురు రైతు వేదికలో శనివారం కళ్యాణలక్ష్మీ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన

మిగతా 8వ పేజీలో..


చెక్కులను అందజేస్తున్న మురళీనాయక్

న్యూస్ బాక్స్



కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ సత్యశారద

మార్కెట్లో పత్తి కొనుగోళ్లపై కలెక్టర్ సమీక్ష

వరంగల్ వ్యవసాయం. అక్టోబరు26: (ఆంధ్రజ్యోతి) : ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో పత్తి కొనుగోళ్లపై మార్కెట్ అధికారులు, వ్యాపారులతో కలెక్టర్ సత్యశారద శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పత్తి కొనుగోళ్లలో తలెత్తున్న సమస్యలు, శుక్రవారం మార్కెట్లో చోటు చేసుకున్న పరిణామాలపై కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు, తెలంగాణ కాటన్ అసోసియేషన్ అధ్యక్షుడు బీ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన వర్షాలతో పత్తిలో తేమ శాతం 15 నుంచి 25 శాతానికి పెరిగిందని, దీంతో సీసీఐ పత్తి కొనుగోలు చేయలేని పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. రైతులు, రాష్ట్ర కాటన్ అసోసియేషన్ తరఫున కేంద్ర జౌళిశాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌కు లేఖ రాసినట్లు పేర్కొన్నారు. పత్తిలో తేమ శాతాన్ని సడలించి సీసీఐతో పత్తిని కొనుగోలు చేయాలని కోరినట్లు తెలిపారు. రైతులను కొందరు రెచ్చగొట్టి వ్యాపారుల పైకి ఉసిగొల్పుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి వారిని నిరోధించాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. తగిన చర్యలు తీసుకుంటామని వ్యాపారులకు కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చింతలపల్లి వీరారావు, ఉపాధ్యక్షుడు నాగమల్ల ఓంకారేశ్వర్, పింగిళి మల్లారెడ్డి, జీ వేణుగోపాల్, అల్లె సంపత్, మార్కెట్ కార్యదర్శి పోలెపాక నిర్మల తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణాలు కాపాడుదాం : సీపీ

హనుమకొండ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : రక్తదానం చేసి మరో ముగ్గురి ప్రాణాలు కాపాడవచ్చని వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం వరంగల్ కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఆర్మ్‌డ్ రిజర్వు, ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో ఆర్మ్‌డ్ రిజర్వు, ట్రాఫిక్ విభాగాలకు చెందిన పోలీసు అధికారులు, సిబ్బందితో పాటు స్థానిక యువకులు, ఆటో డ్రైవర్లు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.

రక్తదానం చేసినవారిని సీపీ వ్యక్తిగతంగా కలిసి అభినందించడంతో పాటు పండ్లు, సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం పోలీసు కమిషనర్ మాట్లాడుతూ పోలీసులు కేవలం శాంతి భద్రతలను రక్షించడమే కాదు సేవా కార్యక్రమాల్లో ముందు వరుసలో ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ రవీందర్, అదనపు డీసిపిలు సురేష్ కుమార్, ఏసీపీలు అనంతయ్య, సురేంద్ర, సత్యనారాయణ, ఆర్‌ఐలు శ్రీధర్, చంద్రశేఖర్, శ్రీనివాస్, స్పర్జన్ రాజ్, ఇన్‌స్పెక్టర్లు సీతారెడ్డి, రామక్రిష్ణ, ఆర్‌ఎస్‌ఐ శ్రవణ్‌కుమార్, ఎంజీఎం రక్తనిధి డాక్టర్ ఆశతో పాటు పోలీసు యూనిట్ వైద్యులు, ఇతర పోలీసు, పరిపాలన, ఎంజీఎం సిబ్బంది పాల్గొన్నారు.

కాళేశ్వరంలో హైకోర్టు జడ్జి పూజలు

మహదేవపూర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జడ్జి బీవీ.వేణుగోపాల్ తన కుటుంబసభ్యులతో శనివారం కాళేశ్వరాన్ని దర్శించుకున్నారు. మొదటగా గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించి గోదావరి మాతకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బోటు షికారు వద్ద త్రివేణి సంగమ పరిసరాల్లో పర్యటించారు. అనంతరం కాళేశ్వర ఆలయానికి చేరుకున్నారు. వారికి దేవస్థాన అర్చకులు, వేద పండితులు పూర్ణకుంభ స్వాగతం పలికి ఆహ్వానించారు. శ్రీ కాళేశ్వర ముక్తీశ్వరస్వామి వారికి జడ్జి కుటుంబ సభ్యులు అభిషేకం చేశారు. అమ్మవారి ఆలయంలో జడ్జి దంపతులకు ఆలయ సూపరింటెండెంట్ స్వామి వారి శేషవస్త్రాలతో సన్మానించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి ఓఎస్డీ బోనాల కిషన్, డీఎస్పీ, సీఐ, ఎస్సైలు, డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ, జిల్లా కోర్టుల జడ్జిలు పాల్గొన్నారు.


గోదావరిలో పూజలు చేస్తున్న జడ్జి దంపతులు

శ్రీనివాస్‌ది ప్రభుత్వ హత్యే

- పీఎస్‌లోనే ఆత్మహత్య చేసుకోవడం బాధాకరం
- ఎమ్మెల్సీలు సత్యవతి రాథోడ్, మధుసూదనాచారి

పాలకుర్తి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రోజురోజుకు శాంతి భద్రతలు దిగజారిపోతున్నాయని గిరిజనులు, దళితులు అన్ని వర్గాల ప్రజలకు రక్షణ కరువైందని ఎమ్మెల్సీలు సత్యవతి రాథోడ్, సిరికొండ మధుసూదనాచారి ధ్వజమెత్తారు. శనివారం మండల కేంద్రంలో గిరిజన యువకుడు శ్రీనివాస్ ఆత్మహత్యకు పాల్పడగా, ఆయన కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆధ్వర్యంలో మహాధర్నా చేపట్టారు. అంతకుముందు మృతుడు శ్రీనివాస్ స్వగ్రామం కొండాపురంలోని మేకలతండాకు వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. పాలకుర్తిలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీలు మాట్లాడుతూ మాట్లాడుతూ రాష్ట్రంలో హోంశాఖ మంత్రి లేడని, అది ముఖ్యమంత్రి వద్దనే ఉందన్నారు. దీంతో పిచ్చోడి చేతిలో రాయిలా ఉందన్నారు. గిరిజన యువకుడు శ్రీనివాస్ విషయంలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లనే పోలీస్‌స్టేషన్ సాక్షిగా పెట్రోల్ పోసుకున్నాడన్నారు. ఈ విషయంలో పోలీసులు ప్రేక్షకపాత్ర పోషించడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు స్థానం లేదని, నిత్యం నేరాలు, ఘోరాలు పెరుగుతున్నాయన్నారు. గిరిజన యువకుడు శ్రీనివాస్ ఆత్మహత్య ప్రభుత్వ వైఫల్యమేనని ఆరోపించారు. శ్రీనివాస్ కుటుంబానికి రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తలను హత్య చేస్తున్న కనీసం పోలీసులు కేసులు పెట్టడం లేదన్నారు. పోలీసులు వారి విధులకు లోబడి వ్యవహరించాలని ప్రస్తుతం పోలీస్ శాఖలో ఆ పరిస్థితి కనిపించడం లేదన్నారు. కేసీఆర్ పాలనలో శాంతిభద్రతలకు పెద్దపీట వేశారని ఎక్కడ ఎలాంటి అన్యాయం జరిగినా బాధితుల పక్షాన ప్రభుత్వం నిలిచేదని తెలిపారు. పోలీస్ శాఖకు పూర్తి అధికారాలు కల్పించి స్వతంత్రంగా విధులు నిర్వహించేలా కేసీఆర్ స్వేచ్ఛా వాతావరణం కల్పించాడని గుర్తు చేశాడు. రేవంత్‌రెడ్డి హోంశాఖను తన గుప్పిట్లో పెట్టుకొని పోలీసులను పావులుగా వాడుకుంటున్నాడని ధ్వజమెత్తారు. దయాకర్‌రావు మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యం, అధికార పార్టీకి చెందిన నాయకుల ఒత్తిడితోనే తనకు న్యాయం జరగడం లేదని చనిపోయే ముందు శ్రీనివాస్ చెప్పినా పట్టించుకోలేదన్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, మధుసూదనాచారిలు డీసీపీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, గాంధీనాయక్, యాకూబ్, దేవేందర్, మహేందర్, నియోజకవర్గం నంచి గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.


ధర్నాలో మాట్లాడుతున్న మాజీ మంత్రి దయాకర్‌రావు, చిత్రంలో ఎమ్మెల్సీలు సత్యవతి రాథోడ్, మధుసూదనాచారి, తదితరులు

అహంకారంతో మాట్లాడితే ఊరుకోం

- 'కల్వకుంట్ల' కుటుంబానికి అన్ని ఆస్తులు ఎక్కడివి
- హైదరాబాద్ చుట్టుపక్కల భూముల్ని దోచుకున్నారు
- కేటీఆర్‌పై ఎమ్మెల్యే కడియం ధ్వజం


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మీరు చేస్తే సంసారం.. ఇతరులు చేస్తే వ్యభిచారమా, అహంకారం, బలుపుతో మాట్లాడితే ఊరుకోం అంటూ జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ధ్వజమెత్తారు. శనివారం ఘన్‌పూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2014 నుంచి 2023 వరకు వివిధ పార్టీలకు చెందిన అనేక మంది ఎమ్మెల్యేలను బీఆర్ఎస్‌లో చేర్చుకోవడం సంసారం, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లో చేర్చుకోవడం వ్యభిచారమా అంటూ ప్రశ్నించారు. పార్టీ మారిన వారు రాజకీయ వ్యభిచారులు అని కేటీఆర్ మాట్లాడడం, ఆయన అహంకారానికి నిదర్శనమన్నారు. ఆయన దిగజారి మాట్లాడడం సరికాదని, దశాబ్దాల కాలంగా అనేక మంది పార్టీ ఫిరాయింపులు చేశారని, చట్టం వచ్చిన తర్వాత కూడా ఫిరాయించారని గుర్తు చేశారు. పార్టీ ఫిరాయింపుల పైన కోర్టులు స్పష్టమైన తీర్పులు ఇస్తున్నాయని గుర్తు చేశారు. రాష్ట్రంలో పార్టీ మారిన ఎమ్మెల్యేల పైన హైకోర్టులో కేసు నడుస్తుం దని తెలిపారు. కోర్టు తీర్పు ఏ రకంగా వచ్చినా ఎవరికి అనుకూలంగా వచ్చిన తీర్పును శిరసావహి స్తామన్నారు.

కేసీఆర్ కూడా పార్టీ ఫిరాయించాడు..

కేసీఆర్ తన రాజకీయ జీవితంను కాంగ్రెస్ పార్టీతో ప్రారంభించారని, తర్వాత టీడీపీలో ఆ తర్వాత టీఆర్ఎస్ పెట్టి బీఆర్ఎస్‌గా మార్చారని పార్టీలు మారిన కేసీఆర్ రాజకీయ వ్యభిచారేనా అని కడియం ప్రశ్నించారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 10ఏళ్ల కాలంలో అనేక మంది ఎమ్మెల్యేలను చేర్చుకోని ఫిరాయింపులకు పాల్పడిందన్నారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించి రాజకీయ వ్యభిచారానికి పెద్దపెద్ద కార్యాలయాలను ప్రారంభించింది, ద్వారాలను తెరిచింది కేటీఆర్ అని మండిపడ్డారు. నోరున్నది కదా అని అహంకారంతో, బలుపుతో ఇష్టమున్నట్లు మాట్లాడడం పద్ధతి కాదన్నారు.

హరీష్ కంటే వెనబడుతున్నానని కేటీఆర్‌కు భయం

హరీష్‌రావు తన కంటే ముందుకు వెళ్తున్నాడని, ప్రతీరోజు మీడియాలో కనిపిస్తున్నాడు, నేను వెనుకబడిపోతున్నాననే భయంతో సభ్యత, సంస్కారంను కోల్పోయి కేటీఆర్ మాట్లాడుతున్నాడని కడియం ఎద్దేవా చేశాడు. 10నెలల కాలంపాటు ప్రజలకు కనిపించకుండా ఫామ్‌హౌస్‌లో కాలంగడిపే పరిస్థితి ఎక్కడా లేదన్నారు. ప్రజా సమస్యలపై ప్రజల ముందుకు రాకపోవడం, ప్రజా సమస్యలను ప్రభుత్వం ముందుకు తీసుకురాకుండా కనిపించకపోవడం దురదృష్టకరమన్నారు. కేటీఆర్ నిజాయితీ పరుడవైతే 2014కు ముందు నీ ఆస్తులు ప్రస్తుతం నీ ఆస్తుల వివరాలను ప్రజల ముందు పెట్టగలవా అని ప్రశ్నించారు. కోట్ల రూపాయలు ఎక్కడి నుంచి వచ్చాయి, వేలాది ఎకరాల భూములు ఎక్కడి నుంచి వచ్చాయి అంటూ ఆరోపించారు. హైదరాబాద్‌లోని బహుళ అంతస్తుల భవనాల్లో బినామీ పేర్ల పైనపాట్లు ఎలా వచ్చాయంటూ ప్రశ్నించారు. ధరణిని అడ్డుపెట్టుకొని కల్వకుంట్ల కుటుంబమంతా హైదరాబాద్ చుట్టు పక్కల విలువైన భూములను దోచుకున్నారని ఆరోపించారు. దేశంలోనే అత్యంత ధనవంతుడైన రాజకీయ నాయకుడు కేటీఆర్ అన్నారు. ఎక్కడి నుంచి వచ్చాయి ఆస్తులు కష్టం చేసి సంపాదించావా, నువ్వేమన్నా సుద్దపూసవా మిడిమిడి జ్ఞానంతో మాట్లాడవద్దని, నువ్వు దూరేదేమో దొమ్మరి గుడిసెల్లో మాట్లాదేమో నీతి వ్యాఖ్యలు అని ఎద్దేవా చేశాడు. కుటుంబం మొత్తం తెలంగాణ మీద పడి దోచుకున్నది, విచ్చలవిడిగా కాంట్రాక్టులు పంచుకున్నది, కమీషన్లు పంచుకున్నది మాకు తెలియదా అని ప్రశ్నించారు. ప్రజలే తప్పుచేశారు, ప్రజలు బాధపడుతున్నారు, బీఆర్ఎస్ ఓడిపోవడంపై అని మాట్లాడడానికి సిగ్గుండాలన్నారు.

నియోజకవర్గం అభివృద్ధి కోసమే పార్టీ మారాను..

తాను నియోజవర్గ అభివృద్ధి కోసం పార్టీ మారానని కడియం తెలిపారు. తాను పార్టీ మారడాన్ని నియోజకవర్గ ప్రజలు సమ్మతించారని అందుకు నిదర్శనం పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 55వేల మెజారిటీని కట్టబెట్టడమేనని తెలిపారు.

అసహనంతో, అహం కారంతో మాట్లాడవద్దు కోర్టు తీర్పును గౌరవించాలని కేటీఆర్‌కు సూచించారు. మరోమారు పిచ్చి పిచ్చిగా మాట్లాడితే బాగుండదని హెచ్చరించాడు. కార్యక్రమంలో నాయకులు నరేందర్ రెడ్డి, బెలిదె వెంకన్న, అంబటి కిషన్‌రాజ్, నాగరబోయిన శ్రీరాములు, శిరీష్ రెడ్డి, గడ్డమీది సురేష్, నూకల ఐలయ్య, కనకం రమేష్, పోలెపల్లి రంజిత్ రెడ్డి, బూర్ల శంకర్, కోతి రాములు, పోగుల సారంగపాణి, దైద ఎలిషన్, రజాక్‌యాదవ్, తెల్లాకుల రామకృష్ణ, వెంకటేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ ఒకరి మృతి


రాజారాం (ఫైల్)

మహబూబాబాద్ రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందిన ఘటన మహబూబాబాద్ మండలం గుండాలగడ్డతండాలో శనివారం చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై దీపికరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. గుండాలగడ్డ తండాకు చెందిన లకావత్ రాజారాం (30) కు రెండెకరాల వ్యవసాయ భూమి ఉంది. అందులో పత్తి, మిర్చి పంటలను సాగు చేశారు. గత కొద్దికాలంగా భార్యాభర్తల మధ్య ఘర్షణలు జరుగుతున్నాయి. మూడ్రోజుల క్రితం భార్య కవితతో ఆయన ఘర్షణపడ్డాడు. మనస్తాపం చెందిన రాజారాం ఇంట్లో ఎవరులేని సమయంలో పురుగులమందు తాగి ఆత్మహత్యా యత్నం చేశాడు. వెంటనే కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ.. మృతి చెందాడు. మృతుడికి భార్య కవిత, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చేపల వేటకు వెళ్లి ..


వశ్య (ఫైల్)

మహబూబాబాద్ రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి కుంటలో మునిగి మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ మండలం లక్ష్మీపురం తండా శివారు గమ్మతండాలో శనివారం చోటు చేసుకుంది. మహబూబాబాద్ రూరల్ ఎస్సై దీపికరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గమ్మతండాకు చెందిన బానోత్ వశ్య (60) గ్రామపంచాయతీలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిపై విధులు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గ్రామశివారులో ఉన్న కుంటలో చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి నీటిలో మునిగి మృతి చెందినట్లు చెప్పారు. అటుగా వెళ్లిన తండవాసులు గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చినట్లు పేర్కొన్నారు. మృతునికి ఇద్దరు కుమారులు శివాజీ, అశోక్‌లు ఉన్నారు. పెద్ద కుమారుడు శివాజీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నెక్కొండలో వృద్ధురాలు..

నెక్కొండ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలోని ఆర్‌యూబీ సమీపంలో శనివారం అకస్మాత్తుగా రోడ్డుపై పడిన వృద్ధురాలు గుగులోత్ జునా (76) మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు.

మహబూబాబాద్ జిల్లా గుడూరు మండలం గుండెంగ గ్రామ శివారు గుగులోతు తండాకు చెందిన జునా కేసముద్రం గ్రామంలోని తన కూతురు ఇంటికి వెళ్లి నడుచుకుంటూ వస్తుండగా ఆర్‌యూబీ సమీపంలో అకస్మాత్తుగా కింద పడింది. వెంటనే స్థానికులు గమనించి వృద్ధురాలిని అక్కడే కూర్చోబెట్టి నీరు తాపించారు. తలకు తీవ్రగాయాలు కావడంతో నీరు తాగిన కొద్ది సేపటికే మృతి చెందింది. ఈ విషయం పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు వృద్ధురాలి వద్ద ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులకు పోలీసులు వృద్ధురాలి శవాన్ని అప్పగించారు. తలకు బలమైన దెబ్బతగలడంతో మృతి చెందినట్లు బంధువులు చెప్పారు.

వ్యవసాయ విద్యుత్ మోటార్ల చోరీ

డోర్నకల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్ మండలంలో శుక్రవారం రాత్రి రైతులకు చెందిన నాలుగు వ్యవసాయ మోటారు చోరీకి గురైనట్లు ఎస్సై వంశీధర్ శనివారం తెలిపారు.

ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. తోడేళ్ల గూడెంకు చెందిన తేనె బ్రహ్మయ్య, ముల్కలపల్లికి చెందిన చాగర్లముడి శ్రీనివాసరావు, చెవుల రంగయ్య, చిల్కోడుకు చెం దిన కోల సాంబశివరావులకు చెందిన వ్యవసాయ విద్యుత్ మోటార్లు చోరీ అయ్యాయి. ఈ విషయంపై రైతులు డోర్నకల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. చోరీకి గురైన విద్యుత్ మోటార్ల విలువ సుమారు రూ.50 వేలకు పైగా ఉంటుందని బాధిత రైతులు తెలిపారు.

మెడికవర్ ఆస్పత్రిలో అరుదైన చికిత్స


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ శరత్‌రెడ్డి

హనుమకొండ కలెక్టరేట్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ హంటర్‌రోడ్‌లోని మెడికవర్ ఆస్పత్రిలో వరంగల్‌లోనే మొట్టమొదటిసారిగా అత్యంత క్లిష్టమైన చికిత్సను విజయవంతం చేసినట్లు సీనియర్ కన్సల్టెంట్ ఇంటర్నేషనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎ.శరత్‌రెడ్డి తెలిపారు. మెడికవర్ ఆస్పత్రిలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ శరత్‌రెడ్డి మాట్లాడుతూ.. కార్డియాక్ సింకోపితో బాధ పడుతున్న వరంగల్‌కు చెందిన 77 సంవత్సరాల వయసు ఉన్న విద్యాసాగర్‌రావుకు మెడికవర్ డాక్టర్ల బృందం ఆధ్వర్యంలో ఈ చికిత్స చేశామన్నారు. విద్యాసాగర్‌రావు గుండె లయ సక్రమంగా లేకపోవడంతో పాటు ఆయన గుండెకు సంబంధించిన రక్తనాళాలు పూడుకుపోవడం, హార్ట్‌వాల్వ్‌లో అవరోధాలు వంటి సమస్యలతో బాధపడుతూ ఎన్నో ఆసుపత్రులలో చికిత్స పొందినా నాయం కాలేదని, మెడికవర్ అడ్మిట్ అయిన వెంటనే మెరుగైన చికిత్స అందించి రోగి సమస్యను పరిష్కరించి ప్రాణాలు కాపాడామన్నారు. విలేకరుల సమావేశంలో కార్డియాలజిస్ట్ డాక్టర్ శ్రవణ్ కుమార్, డాక్టర్ సృజన్ అల్లాడి, అనస్థీషియా డాక్టర్ అవనీశ్, మెడికవర్ హాస్పిటల్ డాక్టర్లు పాల్గొన్నారు.

త్వరలో రామప్ప ఫెస్టివల్

- రిటైర్డు ఐఏఎస్ అధికారి బీపీ ఆచార్య
- ముగిసిన వలంటీర్ల శిక్షణ

వెంకటాపూర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రామప్ప ఫెస్టివల్ త్వరలో నిర్వహించేందుకు రూపకల్పన చేస్తామని కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ట్రస్టీ, రిటైర్డు ఐఏఎస్ అధికారి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ టు గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ డైరెక్టర్ ఆఫ్ జనరల్ బీపీ. ఆచార్య అన్నారు. మండలంలోని పాలంపేటలో యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప ఆలయంలో 12 రోజులుగా నిర్వహిస్తున్న కాకతీయ హెరిటేజ్ వలంటీర్ల శిక్షణ ముగింపు కార్యక్రమం నిట్ రిటైర్డు ప్రొఫెసర్ పాండురంగారావు అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ కార్యక్రమంలో బీపీ ఆచార్య ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

హైదరాబాద్ ఫెస్టివల్ తరహాలో రామప్ప ఫెస్టివల్‌ను కూడా నిర్వహించేందుకు రూపకల్పన చేస్తున్నామన్నారు. ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్పను మరింత ప్రాచుర్యంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేయాలన్నారు. అదేవిధంగా ఇక్కడ పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధిపరచాలని, ఇందుకు యువ వలంటీర్లు కృషి చేయాలన్నారు.

యునెస్కో సూచన మేరకు మూడవ సంవత్సరం కూడా వలంటీర్ల శిక్షణ దిగ్విజయంగా పూర్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ టీఎస్.దివాకర, జిల్లా టూరిజం అధికారి శివాజీ, కాకతీయ హెరిటేజ్ కమిటీ సభ్యులు జనగాం శ్రీధర్‌రావు, కేంద్ర పురావస్తుశాఖ జిల్లా అధికారి మల్లేశం, టూరిజం అసిస్టెంట్ ప్రమోటర్ డాక్టర్ కుసుమ సూర్యకిరణ్, టూరిజం గైడ్‌లు, పురావస్తుశాఖ సిబ్బంది, వివిధ రాష్ట్రాలకు చెందిన వలంటీర్లు పాల్గొన్నారు.



రామప్ప దేవాలయం ఆవరణలో అధికారులు, వలంటీర్లు

'కోట'కు కొత్త అందాలు

- చెదిరిపోతున్న శిల్పకళకు నూతనత్వం
- రసాయనిక చర్యలతో పునరుజ్జీవం
- పూర్వ రూపం చెడిపోకుండా చర్యలు
- ఖిలావరంగల్‌కు పెరుగుతున్న పర్యాటకులు



ఖిలావరంగల్ మధ్యకోటలోని శిల్పాల ఆవరణ

ఖిలా వరంగల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): 700 ఏళ్ల నాటి కాకతీయ శిల్పకళావైభవం కనుమరుగవుతున్న క్రమంలో ఆ సంపదను భావితరాలకు అందించేలా జరుగుతున్న చర్యలు ఫలిస్తున్నాయి. నాటి శిల్పాలను రసాయనిక చర్యలతో రూపం చెడకుండా పరిశుభ్రం చేసి నూతనత్వాన్ని ఆపాదింపజేశారు. ఖిలావరంగల్ పడమర, మధ్య, తూర్పుకోటలతో పాటు శివారు ప్రాంతాలలో బోలెడంత శిల్పసంపదకు నూతన సొబగులు సమకూరాయి. మధ్యకోటలోని కాకతీయుల రాజులు నిర్మించిన దేవాలయాలు, నిర్మాణాలు, కట్టడాలు, శిల్పసంపదలు శత్రురాజుల దాడుల్లో చెల్లాచెదురై మట్టి దిబ్బగా పడిఉన్న కోటను కేంద్రపురావస్తుశాఖ ఆధ్వర్యంలో పునరుజ్జీవం కల్పించే చర్యలు జరుగుతున్నాయి. నాటికాలం దేవాలయాలు, కట్టడాలు, శిల్పాలను 24 ఏళ్ల క్రితం తమిళనాడుకు చెందిన శిల్పులు ఏ శిల్పం ఏ ప్రాంతంలో ఉండాలో, చారిత్రక అంశాలకు అనుగుణంగా కేంద్ర పురావస్తుశాఖావారు చరిత్ర వక్రీకరించకుండా ప్రదర్శనకుంచారు. ఇంకా ఖిలావరంగల్ మధ్యకోటలోని నాలుగు కీర్తితోరణాలు, శిల్పాల ఆవరణలోని శిల్పసౌందర్యాలు, ఖుష్‌మహల్, ఏకశిలగుట్ట, స్వయంభూ-శంభులిగేశ్వర స్వామి దేవాలయం, నేలశంభునిదేవాలయం, లక్ష్మీకొండలదేవాలయం, విఘ్నేశ్వరదేవాలయం, శివాలయం, రామాలయం, నాగమయ్యదేవాలయం, హనుమాన్‌దేవాలయం, మాండాలమ్మ దేవాలయం, సింగారపుబావి, అక్కాచెల్లెళ్ల బావి, సవతుల బావి, కోడికూతబావి, మెట్లబావి, బియ్యంగడ్డ, ఈసన్న బావి, ఏకశిల గుట్ట, గుండంచెరువు, గుర్రపుశాల, కత్తికోట, రాతి, మట్టికోటలు పర్యాటకులకు దర్శనమిస్తాయి. ఇలా ఈ శిల్పసంపదను భావితరాలకు అందించేందుకు ఉపయుక్తంగా ఉండేలా మళ్లీ కొన్ని వందల సంవత్సరాలు చెక్కుచెదరకుండా కాపాడేలా కేంద్ర పురావస్తుశాఖ వరంగల్ శిల్పసంపదపై డీపీఆర్ సిద్ధం చేసింది. ఈ క్రమంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్(ఐవోసీ) ముందుకు రావడంతో కేంద్ర పురావస్తుశాఖ ద్వారా ఐవోసీ నిధులను వరంగల్ ప్రాంతానికి కేటాయింపచేయడంతో సఫలీకృతం కాగా ఇప్పుడు వాటికి సంబంధించి పనులు ప్రారంభంకావడం ఓరుగల్లు చరిత్రకు మహర్దశ తెచ్చినట్టేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



రాళ్లపై చెక్కిన నాటి అద్భుత కళాఖండాలు

కోటలో సౌండ్ అండ్ లైట్ షో..

రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో పదేళ్ల క్రితమే రూ.4కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన సౌండ్ అండ్ లైట్ షో కూడా మరింతగా ఆధునీకీకరింపజేసి ప్రస్తుతం నూతనత్వంతో ప్రదరించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రముఖ గానగాంధర్వుడు స్వర్గీయ బాలసుబ్రహ్మణ్యం 'ఓరుగల్లు రా - ఓరుగల్లు రా, వీరనారులకు ఇది పుట్టినిల్లురా' అంటూ ఆయన గళం నుంచి జాలువారిన ఓరుగుల్లు చారిత్రక విశేషాలు, 50 నిమిషాల నిడివి గల సౌండ్ అండ్ లైట్ షో యధాతథంగా మరింతగా సందర్శకులను కనువిందు చేస్తాయనడంలో సందేహం లేదు.

ముఖ్యమైన రోజుల్లో పసాడ్ వెలుగులు

చారిత్రక ప్రసిద్ధి చెందిన ఖిలావరంగల్ రాతికోట చుట్టూ పసాడ్ ఆధ్వర్యంలో విద్యుత్‌దీపాలను ఏర్పాటు చేశారు. ఖిలావరంగల్ మధ్యకోటలోని రాతికోట చుట్టూ సుమారు 4కిలోమీటర్ల చుట్టూ, అలాగే ఏకశిల గుట్టపై, ఖుష్‌మహల్ చుట్టూ, పసాడ్ విద్యుత్ వెలుగులు రాత్రులు పర్యాటకులకు కనువిందు చేస్తున్నాయి. పసాడ్ విద్యుత్ వెలుగులు ప్రతిసంవత్సరం ఆగస్టు 15న, స్వాతంత్ర్య దినోత్సవం, జనవరి 26న, ఘనతంత్ర దినోత్సవం, జూన్ 2 తెలంగాణ అవతరణదినోత్సవం, ముఖ్యమంత్రి, గవర్నర్, కేంద్ర మంత్రులు. పండుగలు, తదితర రోజులలో పసాడ్ వెలుగులు పర్యాటకులను కనువిందు చేస్తాయి.

సండే స్పెషల్ SUNDAY SPECIAL

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చొరవతో లేజర్‌షో..

ఇందులో భాగంగా మొన్నటిదాకా కేంద్ర సాంస్కృతిక శాఖామంత్రిగా ఉన్న జి.కిషన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో గత సంవత్సరం లేజర్‌షో మంజూరైంది. ఖిలావరంగల్ మధ్యకోటలోని శిల్పాల ఆవరణ రాత్రులు వెన్నెల కురిసిన రాత్రిలాగా పర్యాటకులను కనువిందు చేస్తుందనడంలో అతిశయోక్తిలేదు. సుమారు రూ. 6కోట్లతో అపూర్వలేజర్‌షో వరంగల్ సందర్శకులకు అపూర్వ ఆకర్షణ.

సౌకర్యాలను ఏర్పాటు చేయాలి..

ప్రపంచ, దేశవిదేశాలలో పేరెన్నికగల కాకతీయుల కట్టడాలు, నిర్మాణాలు, అద్భుత శిల్పసంపదలు కలిగిన ఖిలావరంగల్ మధ్యకోట ప్రాంతానికి ఫైవ్‌స్టార్ హోటళ్లు, కాటేజీలు, కోట చుట్టూ బోటింగ్, ఆర్టీసీ మినీ బస్సు, విద్యుత్‌దీపాలు, రోడ్లు, తాగునీరు తదితర సౌకర్యాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించాలి. దీంతో ఖిలావరంగల్ కోటకు మరింతగా పర్యాటకులు వచ్చే అవకాశం ఉందని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



ఖిలావరంగల్‌లో కాకతీయుల కాలంనాటి కీర్తితోరణం

31న మంగళహారతులు, 1న నోములు

- భద్రకాళి దేవస్థానం అర్చకుడు శేషగిరిరావు



భద్రకాళి ఆలయ అర్చకుడు శేషగిరిరావు

వరంగల్ కల్చరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : నరక చతుర్థశి, దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ నెల 31న మంగళహారతులు తీసుకోవాలని, సాయంత్రం ధనలక్ష్మీ, అమావాస్య పూజలను ఆచరించుకోవాలని భద్రకాళి దేవస్థానం ప్రధానార్చకుడు బి.శేషగిరిరావు శనివారం తెలిపారు. 31న బ్రాహ్మీ ముహూర్తం తెల్లవారుజామున 3 గంటల నుంచి 5 లోపు మంగళహారతులు తీసుకోవాలని, నువ్వుల నూనెతో అభ్యంగన స్నానం చేయడం ద్వారా లక్ష్మీదేవి అనుగ్రహం కలుగుతుందన్నారు. తద్వారా గంగలో స్నానం చేసిన ఫలం దక్కుతుందన్నారు. నూతన వస్త్రాలు ధరించి ఆడబిడ్డలతో హారతులు తీసుకోవాలని తెలిపారు. సాయంత్రం వ్యాపార సంస్థలు, దేవాలయాలు, గృహాల్లో ధనలక్ష్మి పూజ చేయాలన్నారు.

నవంబరు 1న కేదారేశ్వర నోములు ఆచరించుకోవాలి

కేదారేశ్వర స్వామి(లక్ష్మీదేవి) నోములను నవంబరు 1న ఆచరించి 2న నోములను ఎత్తుకోవాలని శేషగిరి తెలిపారు. నోములు పడిపోయిన వారు, కొత్తగా నోములు పట్టుకునే వారు, నోములను పంచుకునే వారు ఈ ఏడాది అనుకూలమైన ముహూర్తం ఉందని వివరించారు.

ఆలయాల్లో కార్తీక మాస వేడుకలు నిర్వహించాలి

- నవంబరు 2నుంచి డిసెంబరు 1వరకు ఉత్సవాల నిర్వహణ

వరంగల్ కల్చరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఆలయాల్లో కార్తీక మాస ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలని రాష్ట్ర దేవాదాయ, ధర్మదాయ శాఖ కమిషనర్ హన్మంతరావు ఉత్తర్వులు జారీ చేశారు. దేవాలయాల ఈవోలు, సహాయ కమిషనర్‌కు ఉత్తర్వులు అందినట్లు దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ రాయల సునీత శనివారం తెలిపారు. నవంబర్ 2 నుంచి డిసెంబర్ 1 వరకు ప్రత్యేక పూజలు నిర్వహించాలని దేవాదాయ శాఖ విడుదల చేసిన గైడ్‌లైన్‌లో పేర్కొన్నారు. ప్రతీ రోజు సాయంత్రం 6 గంటల నుంచి 8 వరకు కార్తీక దీపోత్సవాన్ని నిర్వహించాలని తెలిపారు. దీపోత్సవంలో భాగంగా స్థానిక కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఆలయాల్లో జరిగే కార్యక్రమాలను ప్రసార సాధనాల ద్వారా భక్తులకు తెలపాలన్నారు. ప్రత్యేక అభిషేకాలు, పూజలు, దీపోత్సవాలు, సాంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని కమిషనర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు.

నరకాసుర వధ పోస్టర్ల ఆవిష్కరణ



నరకాసురవధ ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి సురేఖ

కరీమాబాద్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : దీపావళి సందర్భంగా ఉర్సు గుట్ట రంగలీలా మైదానం కుడా ప్రాంగణంలో ఈనెల 30న నరకాసుర వధ వేడుకలను నిర్వహించేందుకు నిర్వహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మరుపల్ల రవి ఆధ్వర్యంలో శనివారం మంత్రి కొండా సురేఖ నివాసంలో ఆమె పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలన్నారు. పోస్టర్ ఆవిష్కరణలో నరకాసుర వధ ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి శతపతి శ్యామలరావు, సహాయ కార్యదర్శి ఆనునూరి రామ్మూర్తి, ప్రచార కార్యదర్శి మరుపల్ల గౌతమ్, ఆర్గనైజర్ దూడ కొమురెల్లి, మిర్యాల ఆదిత్య, కుండె రాజు, తౌటం నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

నేడు జానపద ఆట పాటల జాతర

హనుమకొండ కల్చరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): బేబీ కల్చరల్ ఆర్ట్స్ సొసైటీ 25వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఓరుగల్లు గాన గంధర్వులు దివంగతులు వరంగల్ శంకర్, దీకొండ సారంగపాణి యాదిలో జానపద ఆట పాటల జాతర- 2024 కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం 5 గంటలకు హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని డాక్టర్ నేరెళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు సినీ గేయ రచయిత కాసర్ల శ్యామ్ తెలిపారు. వరంగల్ శంకర్ , దీకొండ సారంగపాణి కీర్తి పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా తెలంగాణ క్రాంతిదళ్ వ్యవస్థాపకులు సంగంరెడ్డి పృథ్వీరాజ్ యాదవ్ హాజరవుతారని సినీ గాయకులు, రచయితలు వరంగల్ శ్రీనివాస్, నీరడి ప్రణయ్ కుమార్,అంతడుపుల నాగరాజు, భూక్య సుశీల, జడల శివ పాల్గొంటారని తెలిపారు. కవులు, కళాకారులు, సంగీత అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

వన్ నేషన్.. వన్ స్టూడెంట్.. వన్ నెంబర్

- ఆధార్ తరహాలో విద్యార్థులకు 'అపార్' గుర్తింపు
- కార్డుల జారీకి కేంద్రం మార్గదర్శకాలు
- తల్లిదండ్రుల సమ్మతితో విద్యాశాఖ కసరత్తు

• మీ కోసం

వెంకటాపూర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): 'వన్ నేషన్ వన్ స్టూడెంట్ ' నినాదంతో పాటు.. జాతీయ నూతన విద్యా విధానం-2020 అమలులో భాగంగా కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ కొత్త అధ్యయనానికి శ్రీకారం చుట్టింది. ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమీ అకౌంట్ రిజిస్ట్రీ(అపార్) విధానంలో దేశంలో ప్రతీ విద్యార్థికి ఒక గుర్తింపు సంఖ్యను కేటాయించనుంది. జాతీయ స్థాయిలో జరిగే ఈ ప్రక్రియలో విద్యార్థుల పూర్తి సమాచారాన్ని నిక్షిప్తం చేస్తారు. ఈ దిశగా అడుగేసింది. కేజీ నుంచి పీజీ వరకు చదవే విద్యార్థుల కు ఈ నెంబరును కేటాయించేలా కార్యాచరణ మొదలు పెట్టనుంది. అపార్ అనేది విద్యార్థి జీవితకాల ఐడీగా పరిగణిస్తారు. ఇందులో విద్యార్థి అకడ మిక్ జర్నీ, విజయాలు తదితర సమచారాన్ని నిక్షప్తం చేసి ఉంచుతారు. అయితే తల్లిదండ్రులకు ఈ ఐడీ ప్రాముఖ్యతను వివరించి వారి సమ్మతితో తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం అన్ని పాఠశాలలకు మార్గదర్శకాలను జారీ చేసింది.

ప్రయోజనమేంటి?

విద్యార్థి కేజీ నుంచి పీజీ వరకు చదివిన, చదువుతున్న సమగ్ర వివరాలు ఒకే గొడుగు కిందకు వస్తాయి. ఎల్‌కేజీలో చేరినప్పటి నుంచి విద్యాభ్యాసం పూర్తయ్యే వరకు పూర్తి వివరాలును ఎప్పటికప్పుడు గుర్తించేందుకు వీలుగా ఈకార్డు ఉపయోగపడనుంది. ఈకొత్త కార్డును ఆదార్ సంఖ్యతోపాటు 'అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్(ఏబీసీ)' అనే ఎడ్యూలాకర్‌కు అనుసంధానించబడి ఉంటుంది. పాఠశాల విద్యలోని పిల్లలకు ప్రత్యేక గుర్తింపు ఇచ్చే



విధానాన్ని ఇప్పటికే కొన్ని రాష్ట్రాలు అమలు చేస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో మాత్రం 'చైల్డ్ ఇన్ఫో' పేరిట ఒక్కో విద్యార్థికి, ఒక్కో సంఖ్య విధానాన్ని కొన్నేళ్లుగా కేటాయిస్తున్నారు. ప్రస్తుతం కేంద్ర విద్యాశాఖ అమలు చేయబోతున్న ఈవిధానం ద్వారా దేశవ్యాప్తంగా 1 నుంచి 12వ తరగతి వరకు దాదాపు 26 వేల కోట్ల మంది విద్యార్థులకు 12 అంకెలున్న సంఖ్యను కేటాయిస్తారు.

నిర్వహణ ఇలా...

కేంద్ర విద్యాశాఖ పరిధిలోని నేషనల్ ఎడ్యుకేషనల్ టెక్నాలజీ ఫోరం వారికి ఈ బాధ్యతను అప్పగించింది. ఆధార్‌తో అనుసంధానం చేసిన ప్రత్యేక సంఖ్యను నమోదుచేస్తే చాలు. విద్యార్థి కుటుంబం వివరాలు, మార్కుల సర్టిఫికెట్లు, నైపుణ్యాలు, పొందిన స్కాలర్‌షిప్ తదితర వివరాలన్నీ తెలుసుకునే వీలుంటుంది. వివిధ కోర్సుల్లో ప్రవేశాలు పొందే సమయంలోనూ ధృవీకరణపత్రాలను భౌతికంగా కాకుండా, డిజిటల్‌లో పరిశీలించి సీటు ఇచ్చే అవకాశం ఉంటుంది. ప్రవేశ పరీక్షల దరఖాస్తుల్లోనూ ఈ సంఖ్యను నమోదు చేస్తే సరిపోతుందని ఏఐసీటీఈ వర్గాలు వెల్లడిస్తాయి.

నమోదు ప్రక్రియ

నమోదు ప్రక్రియ వారి తల్లిదండ్రుల సమ్మతితో పాఠశాలలో నిర్వహిస్తారు. వారు ఏ సమయంలో వారి సమ్మతిని ఉపసంహరించుకోవచ్చు. అవసరమైనప్పుడు సంబంధిత ప్రభుత్వ ఏజెన్సీలతో మాత్రమే డేటాను పంచుకుంటామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. పాఠశాలల ద్వారా ప్రతి విద్యార్థిపై సేకరించిన డేటా కేంద్రంగా పనిచేస్తున్న జిల్లా సమాచార పోర్టల్‌లో నిల్వ చేసి.. గోప్యత పాటిస్తారు.

విద్యార్థులకు ప్రయోజనకరం

అడిచెర్ల రాజయ్య, వెంకటాపూర్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు



విద్యార్థులకు సంబంధించిన పూర్తి సమాచారం ఏకీకృతంగా అపార్ కార్డు ద్వారా అందుబాటులోకి రావడం ప్రయోజనకరంగా ఉంటుంది. తల్లిదండ్రుల సమ్మతితోనే చేపట్టాలని మార్గదర్శకాలు ఉన్నాయి. ఇందులో ఎలాంటి ఇబ్బందిలేదు. విద్యార్థులు, తల్లిందండ్రులు ఈ ప్రక్రియకు సహకరించాలి.

ఎన్నో సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది

ఏళ్ల మధుసూదన్, నర్సాపూర్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు



విద్యార్థి తన విద్యాభ్యాస దశలో వివిధ రకాల ప్రాంతాల్లో చదువుతారు. వీటన్నింటినీ ఒకే గొడుగు కిందకు తేవడం శుభ పరిణామం. కేంద్రం తీసుకొస్తున్న ఈ అపార్ ఐడీ విధానం విద్యార్థులకు సౌలభ్యంగా ఉంటుంది. పదేపదే టీసీలు, బోనఫైడ్ పత్రాలు సేకరించడం లాంటి సమస్యలకు పరిష్కారం దొరుకుంది. విద్యార్థి ప్రగతి నైపుణ్యాలు ఒకేచోట నిక్షిప్తం చేసి ఉంటాయి.



తిరగలి కోసం తిరగాలి..!

కొత్తపోకడలు సంతరించకుంటున్న తరుణంలో పాత జ్ఞాపకాలు కనుమరుగైపోతున్నాయి. తరతరాలుగా మన పూర్వీకులు వినియోగించిన వస్తువులు ఫ్యాషన్ పేరిట ఇప్పుడు ఆపాత మధురాలుగా మిగిలిపోతున్నాయి. గతంలో ధాన్యాన్ని పిండి చేయడానికి మన పెద్దలు ఇసుర్రాయి (తిరగలి)ని ఉపయోగించేవారు. యాంత్రిక సొబగులు ఆరంగేట్రం చేయడంతో ఇసుర్రాయి కాస్త పట్టణ, నగర ప్రాంతాల్లో పూర్తిగా మాయమైపోయింది. పల్లె సీమల్లో అక్కడో ఇక్కడో మాత్రం మచ్చుకు దర్శనమిస్తుంటున్నాయి. ప్రధానంగా గతంలో మరయంత్రాలు, గిర్నీలు, అందుబాటులో లేని కాలంలో ఆదిమానవులు చూపిన దారిలో రాతి వస్తువులను వాడుతుండేవారు. అదే క్రమంలో ఇసుర్రాయి కూడా పూర్వీకులకు నేటి తరం గిర్నీగా పనిచేస్తుండేది. జొన్నలు, సజ్జలు, కొర్రలు, పెసర్లు, కందులు లాంటి ఆహార ధాన్యాలను పిండి చేసేందుకు, పప్పులుగా తయారు చేసేందుకు ఇసుర్రాయి ప్రధానంగా పనిచేస్తుండేది. జొన్నగటక కోసం జొన్నలను పొద్దున సాయంత్రం ఇసుర్రాయిపై ఇసురుతుండేది. కాలక్రమేణా ఇప్పుడు మిక్సర్ గ్రైండర్లు, గిర్నీలు అందుబాటులోకి రావడంతో ఇప్పుడా తిరగలి(ఇసుర్రాయి) కనుమరుగైపోయింది. దాని జాడ కోసం ఇల్లుల్లా తిరగాల్సి వస్తుంది.

- లింగాలఘణపురం

సామాజిక 'సేవా'వాణి'

- రెండు దశాబ్దాలుగా పలు కార్యక్రమాల నిర్వహణ
- గుడుంబా నివారణకు చైతన్య సదస్సులు
- కరోనా సమయంలోనూ బాధితులకు అండగా నాగవాణి
- సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్‌గా బాల్యవివాహాల నిర్మూలనకు కృషి

• ఆదర్శం

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మహిళలు వంటింటికే పరిమితం కాదని, అన్ని రంగాల్లోనూ మగవారితో సమానంగా, ఆదర్శంగా దూసుకుపోగలరని నిరూపిస్తున్నారు మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం మాటేడు గ్రామానికి చెందిన డాక్టర్ నాగవాణి. రెండు దశాబ్దాలుగా సామాజిక రుగ్మతలపై పోరాడుతూనే స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కరోనా విపత్కర సమయంలోనూ ప్రాణాలను సైతం పణంగా పెట్టి బాధితులకు ఆహారాన్ని అందించి ధైర్యం నింపారు. మాటేడు గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు సుంకరనేని శ్రీశైలం, సుభద్రల కుమార్తె డాక్టర్ నాగవాణి తన తల్లిదండ్రుల నుంచి సేవా దృక్పథాన్ని అలవర్చుకుని 20ఏళ్లుగా తనకంటూ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు తొర్రూరు ప్రభుత్వ పాఠశాల, స్థానిక ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం, వరంగల్ ఎస్‌వీఎస్ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదివారు. ఆ తర్వాత హన్మకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో బీఎస్సీ బీజెడ్సీ పూర్తి చేయగా.. ప్రభుత్వ ఉపాధ్యాయుడు మురళీకృష్ణతో వివాహం జరిగింది. అంతటితో చదువును ఆపకుండా భర్త ప్రోత్సాహంతో వరంగల్ కాకతీయ వర్సిటీలో బీఎల్ఐసీ, ఎమ్మెస్సీ (కెమిస్ట్రీ) పూర్తి చేసి 2014లో డాక్టరేట్ పొందారు. ఆ తర్వాత నాగవాణి మహబూబాబాద్ పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేశారు.



కేయూలో ఇన్‌చార్జ్ వైస్ చాన్స్‌లర్ సాయిలు చేతుల మీదుగా డాక్టరేట్ పట్టా అందుకుంటున్న నాగవాణి (ఫైల్)



మహబూబాబాద్‌లో కుట్టు శిక్షణ, మగ్గం శిక్షణ పూర్తయిన మహిళలతో డాక్టర్ నాగవాణి (ఫైల్)

శ్రీవాణి ఎడ్యుకేషనల్ అండ్ సోషల్ సర్వీస్ సొసైటీ ద్వారా

తొలి సేవాగుణం కలిగిన నాగవాణి తాను ప్రిన్సిపాల్‌గా పనిచేసిన రోజుల్లో తండాల్లో యువకులు గుడుంబాకు బానిసై మృత్యువాతపడటం, చిన్నవయసులోనే యువతులు వితంతువులుగా మారుతుండటంతో చలించిపోయారు. తండాల్లో గుడుంబా నివారణకు చైతన్య సదస్సులను నిర్వహించి గుడుంబా వల్ల అనర్థాలపై అవగాహన కల్పించి.. తండాల్లో గుడుంబా నివారణ కోసం తన వంతు కృషి చేశారు. ఈ క్రమంలోనే 2014లో శ్రీవాణి ఎడ్యుకేషనల్ అండ్ సర్వీస్ సొసైటీ (స్వచ్ఛంద సంస్థ)ని స్థాపించి తద్వారా అనేక సామాజిక సేవలను అందిస్తున్నారు. ఏటా జిల్లా వ్యాప్తంగా 50 నుంచి 60 ప్రభుత్వ పాఠశాలల్లో నిరుపేద విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పదో తరతగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్నారు. అంతేకాకుండా పలు పాఠశాలలకు మైకులు, ప్రొజెక్టర్లు కూడా అందించారు. 2017లో లయన్స్ సేవా తరుణి తొర్రూరు క్లబ్ స్థాపనలో క్రియాశీల పాత్ర పోషించారు. 37మంది సభ్యులతో ఏర్పాటైన ఈ లయన్స్ సేవాతరుణి ద్వారా అనేక సేవా కార్యక్రమాలను చేపట్టారు. ప్రస్తుతం ఆమె సేవ్‌గర్ల్ చైల్డ్ డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్‌గా కొనసాగుతున్నారు. తన అన్నయ్య మాటేడు సర్పంచ్ పినాకపాణితో కలిసి గ్రామంలో ప్రభుత్వ ఆస్పత్రి భవన స్థలం కోసం రూ.లక్ష విరాళాన్ని అందించారు.



తొర్రూరు మండలం మడిపెల్లి ప్రభుత్వ పాఠశాలలో పలకలు, నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న డాక్టర్ నాగవాణి (ఫైల్)

2019లో కరోనా సమయంలో ఆస్పత్రిలో చికిత్స పొందిన సుమారు 1000 మందికి పైగా కరోనా బాధితులకు ఆహారాన్ని అందించి వారిలో ధైర్యం నింపారు. అలాగే గ్రామాల్లో కరోనా నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలను పంపిణీ చేయడం, నాటించడంతో పాటు వినాయక నవరాత్రుల్లో మట్టి వినాయక విగ్రహాలను పూజించేలా అవగాహన కల్పించారు.

2021 నుంచి సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్‌గా సేవలు

చైల్డ్ వెల్ఫేర్ కమిటీ(సీడబ్ల్యూసీ) ఎంపిక పరీక్షలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన డాక్టర్ నాగవాణి 2021 నుంచి మహబూబాబాద్ జిల్లాలో సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్‌గా సేవలందిస్తున్నారు. బాల్యవివాహాల నిర్మూలన కోసం కృషి చేస్తున్న ఆమె.. అక్రమ దత్తతలు అనర్థాలపై అవగాహన కల్పిస్తున్నారు. బాలకార్మిక నిర్మూలనలో భాగంగా బయ్యారం ప్రాంతంలో ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న పిల్లలకు విద్యనందించేందుకు యజమానుల సహకారంతో ప్రత్యేక పాఠశాలలను ఏర్పాటు చేశారు. తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలకు స్వచ్ఛంద సంస్థల సహకారంతో చదివించి ఉన్నత స్థానాల్లో నిలిపేలా కృషి చేశారు. సామాజిక సేవలో రాణిస్తున్న డాక్టర్ నాగవాణి అనేక ఉత్తమ అవార్డులు పొందారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలనే సంకల్పంతో వారికి కుట్టుశిక్షణ, మగ్గం వర్క్స్‌లో శిక్షణనిప్పిస్తున్నారు.

అందరూ సహాయం చేసే స్థాయికి ఎదగాలి

• అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో



మాట్లాడుతున్న లెనిన్ వత్సల్ టొప్పో

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు ఆపదలో ఉన్న వారికి సహాయం చేసేస్థాయికి ఎదగాలని జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో అన్నారు. మహబూబాబాద్ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో యంగ్‌మెన్స్ క్రిస్టియన్ అసోసియేషన్ (వైఎంసీఏ) ఆధ్వర్యంలో 2023-24 విద్యాసంవత్సర పదవ తరగతి వార్షిక పరీక్ష ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు శనివారం నగదుతో పాటు మెమెంటోలను అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ కార్యదర్శి బొడ్డు సుధాకర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కలెక్టర్‌లెనిన్‌వత్సల్‌టొప్పో మాట్లాడుతూ... అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యారంగంలో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులకు నగదు పారితోషికం అందించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని పట్టుదల, క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. విద్యార్థి దశనుంచే సేవాభావం అలవర్చుకొని ఆపదలో ఉన్న వారికి సహాయం చేసే విధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి వెంకటేశ్వర్లు, ఇన్చార్జీ హెచ్‌ఎం సంజీవ, అసోసియేషన్ బాధ్యులు అనుదీప్, బొడ్డు శశికర్, శకుంతల, సతీష్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ కంచె ఏదీ?

• విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడుతున్న మూగజీవాలు

• పట్టించుకోని అధికారులు

నర్సింహులపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచె లేకపోవడంతో నిత్యం విద్యుదాఘాతంతో మూగజీవాలు, ప్రజలు మృత్యువాత పడుతున్నారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ కవచాలు ఏర్పాటును పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో మూగజీవాలకు ప్రాణ సంకటంగా మారాయి. ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని రైతులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నర్సింహులపేట మండలంలోని 22 గ్రామ పంచాయతీలు, 35తండాల పరిధిలో 250కి పైగా ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. మండలంలో కొన్ని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు మినహా రహదారులు, నివాసాలు, తాగునీటి బావుల దగ్గర ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లులకు కంచె ఏర్పాటు చేయలేదు. ఏ క్షణంలో ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

గాలిలో మూగజీవుల ప్రాణాలు..

ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచె ఏర్పాటు చేయకపోవడంతో మూగజీవులు, ప్రజలు ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. వర్షాకాలం వస్తే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. 2020 నుంచి 2024 అక్టోబరు వరకు 112 దుక్కిటెద్దులు, 60 గేదెలు, 36 పశువులు విద్యుత్ షాక్‌తో మృత్యువాత పడగా, 18 మంది రైతులు ప్రాణాలు కోల్పోయారు.



పెద్దనాగారంలో విద్యుదాఘాతంతో మృతి చెందిన కాడెద్దు (ఫైల్)

ప్రమాదాలు జరుగుతున్నా పట్టింపేది?

మండలవ్యాప్తంగా రక్షణలేని ట్రాన్స్‌ఫార్మర్లతో విద్యుత్ ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఏ క్షణంలో ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ ఉన్నతాధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచెలను ఏర్పాటు చేసి, శిథిలావస్థలో ఉన్న విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

కంచెలు ఏర్పాటు చేయాలి

- కొంపెల్లి నరేష్, నర్సింహులపేట



గ్రామాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు కంచె ఏర్పాటు చేస్తే ప్రమాదాలు జరుగకుండా ఉంటాయి. అధికారులు చొరవ తీసుకొని ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ఏర్పాటు చేయాలి.

ఆసరా పింఛన్లను పెంచాలి : సీపీఎం

కేసముద్రం, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో చేసిన వాగ్దానం మేరకు ఆసరా పింఛన్లను వృద్ధులకు, వితంతులకు రూ.4వేలు, దివ్యాంగులకు రూ.6వేలు పెంచి ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి గొడిశాల వెంకన్న డిమాండ్ చేశారు. తాళ్లపూసపల్లిలో శనివారం నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పది నెలలవుతున్నప్పటికీ పింఛన్లను పెంచడంలేదని అన్నారు. సమావేశంలో నాగెల్లి ఉప్పలయ్య, దైద భిక్షమయ్య, తోట సోమక్క, కొరె ఎల్లయ్య, నీలమ్మ, ఎలమ్మ, ఉప్పలమ్మ పాల్గొన్నారు.

మార్కెట్‌ను సందర్శించిన మునిసిపల్ చైర్మన్

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మోడల్ మార్కెట్‌ను శనివారం మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి కూరగాయల వ్యాపారులతో కలిసి సందర్శించారు. మార్కెట్‌లో కూరగాయల వ్యాపారులకు దుకాణాలను కేటాయించడం కోసం పరిశీలించారు. వ్యాపారులకు దుకాణాల కేటాయింపు విషయాన్ని ఎమ్మెల్యే మురళీనాయక్ దృష్టికి తీసుకువెళ్లి అందుకు సంబంధించిన ఏర్పాట్లు చేయాలని చైర్మన్ అధికారులకు సూచించారు. వైస్ చైర్మన్ మార్నేనివెంకన్న, మునిసిపల్ ఫ్లోర్‌లీడర్లు బి.అజయ్‌సారథిరెడ్డి, చిట్యాల జనార్థన్, పెద్ది సైదులు, వెంకటాద్రి పాల్గొన్నారు.

అనారోగ్యంతో విద్యార్థిని మృతి

• ఆర్‌ఎంపీ వైద్యుడిపై కేసు నమోదు



ఐశ్వర్య (ఫైల్)

తొర్రూరు రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడుతున్న బాలికకు ఆర్‌ఎంపీ వైద్యుడు చికిత్స చేస్తుండగా, బాలిక మృతి చెందిన ఘటన హరిపిరాలలో చోటు చేసుకుంది. కుటుంబసభ్యులు, బంధువుల కథనం ప్రకారం. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం రావులపల్లి గ్రామశివారు ఎనకుంటతండాకు చెందిన బానోతు రమేష్-జ్యోతి దంపతులకు కుమార్తె ఐశ్వర్య (15), కుమారుడు ఉన్నారు. ఐశ్వర్య స్థానిక రావులపల్లి ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతుంది. ఈ క్రమంలో 10 రోజులుగా జ్వరంతో బాధపడుతున్న ఐశ్వర్యను రమేష్ శుక్రవారం రాత్రి తండాకు సమీపంలో ఉన్న తొర్రూరు మండలం హరిపిరాల గ్రామ ఆర్‌ఎంపీ వైద్యుడు సారయ్య వద్దకు తీసుకువచ్చారు. ఈ క్రమంలో ఆర్‌ఎంపీ వైద్యుడు రాత్రి వేళలో వైద్యం అందిస్తుండగా కడుపు నొప్పి అంటూ వాంతులు చేసుకోవడంతో హుటాహుటీన తొర్రూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఆర్‌ఎంపీ వైద్యుడు సారయ్య వైద్యం చేస్తుండగానే తన కూతురు మృతి చెందిందని తండ్రి రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం పంపించినట్లు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

గన్నీబ్యాగుల కొనుగోలు కొటేషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని మైనార్టీ గురుకుల బాలుర పాఠశాలలో స్ర్కాపు గన్నీ బ్యాగుల కొనుగోలు దారుల నుంచికొటేషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన, ఆసక్తిగల కొనుగోలు దారులే ఈనెల 28వ తేదీ నుంచి 31 వరకు నేరుగా పాఠశాలకు సంప్రదించి, కొటేషన్సుకు ఫారాలను అందచేయాలన్నారు.

పారా మెడికల్ కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలి

నెహ్రూసెంటర్, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి) : పారా మెడికల్ కోర్సులైన డీఎంఎస్టీ, డీఈసీజీల్లో అడ్మిషన్ పొందడానికి ఈనెల 30వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ వెంకట్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తుతో పాటు అన్ని ధ్రువీకరణ పత్రాల కాపీలను స్వీయ ధ్రువీకరణతో జత చేయాలన్నారు. అప్లికేషన్‌లలో తప్పుడు సమాచారం ఇచ్చినా, సంబంధిత అన్ని సర్టిఫికెట్లు సమర్పించని ఎడల అడ్మిషన్లు తిరస్కరించబడుతాయని చెప్పారు. దరఖాస్తు ఫారం, ఇతర సమాచారం కోసం www.tspmb.telangana.gov.in ఆన్‌లైన్ సంప్రదించాలన్నారు.

నేడు గిరిజనేతరుల సమావేశం

గూడూరు, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి) : గిరిజనేతరుల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం గూడూరు మహేశ్వర గార్డెన్స్‌లో సమావేశం నిర్వహించనున్నట్లు కమిటీ కన్వీనర్ కత్తి స్వామి తెలిపారు. గూడూరులో శనివారం వ్యాపార, వాణిజ్య సముదాయాల యాజమానులకు ఈ సమావేశానికి హాజరు కావాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సమావేశానికి తెలంగాణ జన సమితి రాష్ట్ర నాయకులు అంబటి శ్రీనివాస్, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు డోలి సత్యనారాయణ హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. సమావేశం అనంతరం మహేశ్వర గార్డెన్ నుంచి ఫారెస్టు శాఖ కార్యాలయం వరకు ద్విచక్రవాహన ర్యాలీ ఉంటుందని చెప్పారు.

రేపు మెరిట్ జాబితా విడుదల

నెహ్రూసెంటర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వైద్య, ఆరోగ్యశాఖలో జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) పథకంలో ఖాళీగా ఉన్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పోస్టుల భర్తీ కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల మెరిట్ లిస్టును ఈనెల 28న ప్రకటించనున్నట్లు డీఎంఅండ్‌హెచ్‌వో మురళీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మెరిట్ జాబితాకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరూ వెబ్‌సైట్ mahabubabad.telangana. gov.inలో పూర్తి వివరాలు పొందవచ్చన్నారు. నవంబర్ 6న 1:3 నిష్పత్తి ప్రకారం అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్స్ పరిశీలన ఉంటుందన్నారు. మరుసటి రోజు కార్యాలయంలో కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

సుడిదోమ నివారణకు చర్యలు తీసుకోవాలి

తొర్రూరు రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం వరిలో వ్యాప్తి చెందే సుడిదోమ నివారణ పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని కేవీకే మల్యాల శాస్త్రవేత్త మాలతి సూచించారు. గుర్తూర్‌లో శనివారం శాస్త్రవేత్తలు మాలతి, డీఏవో విజయ్‌చందర్‌తో కలిసి వరి పంటను పరిశీలించి మాట్లాడారు. పంటలో సుడిదోమలు రాకుండా రైతులు ఖాళీ ప్రదేశాలు ఏర్పాటు చేయాలని, మెటాజిన్ అనే మందును ఎకరాకు 120 గ్రాములు పిచ్చికారి చేయాలని సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు క్రాంతికుమార్, ఏఈవో భాస్కర్, రైతులు పాల్గొన్నారు.



బయ్యారంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

పోలీస్ అమరవీరుల సేవలు చిరస్మరణీయం : సీఐ రవికుమార్

బయ్యారం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : శాంతిభద్రతల పరిరక్షణ కోసం అంకిత భావంతో విధులు నిర్వహించిన పోలీస్ అమరుల సేవలు చిరస్మరణీయమని సీఐ రవికుమార్ అన్నారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా బయ్యారంలో బస్టాండ్ సెంటర్ నుంచి పోలీస్‌స్టేషన్ వరకు శనివారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు ప్రజల రక్షణ కోసం పాటు పడుతున్నట్లు వెల్లడించారు. ప్రజలు పోలీసుల సేవలకు సహకరిస్తూ సంఘ విద్రోహశక్తుల నుంచి శాంతిభద్రతలను పరిరక్షించేందుకు తోడ్పాటునందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై తిరుపతి, సిబ్బంది, ఆటోవర్కర్స్ యూనియన్ నాయకులు, డ్రైవర్లు, ప్రజలు పాల్గొన్నారు.

ఓటు హక్కు కల్పించాలి : టీపీటీఎఫ్

కేసముద్రం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్‌జీటీ)లకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు గుండు సురేందర్ డిమాండ్ చేశారు. కేసముద్రంలో శనివారం ఆయన మాట్లాడుతూ స్కూల్ అసిస్టెంట్ల కంటే ఎస్‌జీటీల సంఖ్య అధికంగా ఉంటుందన్నారు. శాసన మండలిలో ఉపాధ్యాయుల సమస్యలపై మాట్లాడే సభ్యున్ని ఎన్నుకోవడంలో ఎస్‌జీటీలకు అవకాశం లేకపోవడం ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసినట్లేనని అన్నారు. ఇప్పటికైనా ఓటు హక్కుకల్పించాలని కోరారు.

ఇంటర్ ఫలితాల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలి : డీఐఈవో



మహబూబాబాద్‌లో మాట్లాడుతున్న డీఐఈవో మదార్‌గౌడ్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ ఫలితాల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని డీఐఈవో మదార్‌గౌడ్ సూచించారు. మహబూబాబాద్‌లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన హాజరై మాట్లాడుతూ విద్యార్థుల అభివృద్ధికి అధ్యాపకులు పాటుపడాలన్నారు. పాఠ్యాంశాలతో పాటు సామాజిక అంశాలపై కూడా అవగాహన కల్పించాలని సూచించారు. విశిష్ట అతిథిలుగా హాజరైన బీమ్లానాయక్, డోలి సత్యనారాయణ, బొడ్డుపెల్లి ఉపేందర్ మాట్లాడుతూ విద్యార్థినులు ఆత్మవిశ్వాసం పెంపొందించుకొని అధ్యాపకులు బోధిస్తున్న పాఠ్యాంశాలను ఎప్పటికప్పుడు చదువుకొని రాబోయే వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. అనాథపిల్లలకు పరీక్ష ఫీజు చెల్లిస్తామని గ్రంథపాలకు సంఘం నాయకుడు పెండ్లి అశోక్ ప్రకటించారు. ఉత్తమ ఫలితాలు సాధించే విద్యార్థినులకు రోటరీ క్లబ్, వాసవి క్లబ్‌ల ద్వారా బహుమతులు అందజేస్తామని కార్యదర్శి వేమిశెట్టి కిషోర్‌కుమార్ పేర్కొన్నారు. కళాశాలలో చదివే పేద విద్యార్థినులకు ఉచితంగా యూనిఫాం అందజేస్తామని ఏరె నారాయణ, వీవీ నాగేందర్ తెలిపారు. విద్యార్థినులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ పొక్కుల సదానందం అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యకమంలో అధ్యాపకులు శ్రీనివాస్, కుమార్, రవికిరణ్, శ్రీను, స్వాతి, సురేందర్, సాదికలి, సరిత, కిరణ్‌కుమార్, నవీన్, భార్గవి, సృజన, నాగేశ్వర్‌రావు, పూర్ణిమ, రవి, యాకయ్య, అప్రోచ్, రమేష్, భాగ్యలక్ష్మి, లక్ష్మీ పాల్గొన్నారు.

కానిస్టేబుల్ అంజయ్యకు సన్మానం

మహబూబాబాద్ రూరల్, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల జరిగిన తెలంగాణ స్టేట్ పోలీస్ డ్యూటీమీట్‌లో పాల్గొని గోల్డ్ మెడల్ సాధించిన బాంబ్ స్క్వాడ్ కానిస్టేబుల్ అంజయ్యను శనివారం ఐఎంఏ హాల్లో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు బానోత్ నెహ్రూరాథోడ్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నెహ్రూరాథోడ్ మాట్లాడుతూ మహబూబాబాద్ పోలీస్ కీర్తిని రాష్ట్రస్థాయిలో గుర్తింపు తీసుకువచ్చినందుకు గాను ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంజయ్యను సన్మానించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ డాక్టర్ సురేందర్ పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్ల పంపిణీ

గూడూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ అమరవీరుల స్మారక వారోత్సవాల్లో భాగంగా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో శనివారం గూడూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో సీఐ బాబురావు రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకమన్నారు. ఎస్సై గిరిధర్‌రెడ్డి, డాక్టర్ నవత, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ లబ్ధిదారులకు బిల్లులు చెల్లించాలి

• ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : సీఎంఆర్‌ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు తక్కువ శాతం డబ్బులతో చెక్కులు వస్తున్నాయని, వారికి పూర్తి స్థాయి బిల్లులు చెల్లించే విధంగా ప్రభుత్వం కృషి చేయాలని ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ డిమాండ్ చేశారు. మహబూబాబాద్ పట్టణంలో శనివారం రూ.25,46,500 విలువ గల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్న పేదలకు తక్కువ డబ్బులతో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు వస్తున్నాయని ఆరోపించారు. రూ.10 లక్షల బిల్లులు పెడితే కేవలం రూ. 60 వేలు మాత్రమే బిల్లు వస్తుందని, పూర్తిస్థాయి బిల్లులు వచ్చే విధంగా ప్రభుత్వం కృషి చేయాలన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డి, బొమ్మకంటి వెంకట్‌గౌడ్ పాల్గొన్నారు. అలాగే గుస్సాడీ నృత్యకళాకారుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత గుస్సాడీ కనకరాజు మృతి పట్ల సత్యవతిరాథోడ్ సంతాపం వ్యక్తం చేశారు. గుస్సాడీ నృత్యాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. గోండు కుటుంబంలో పుట్టి గుస్సాడీ నృత్య ఉనికిని కొనసాగించడానికి కృషి చేశారన్నారు.

'అంబేద్కర్ అభయహస్తం పథకాన్ని అమలు చేయాలి'

నెహ్రూసెంటర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) :కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చే ముందు ఎన్నికల మేనిఫెస్టోలో ప్రవేశపెట్టిన అంబేద్కర్ అభయహస్తం పథకాన్ని అమలు చేసి దళితులకు రూ.12 లక్షలు అందించాలని ఎమ్మార్పీఎస్ దండోరా జాతీయ కార్యదర్శి కొండ్ర ఎల్లయ్య కోరారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ అధికారంలోకి వచ్చాక అంబేద్కర్ అభయహస్తం పథకాన్ని అమలు చేస్తామని ఏజెండాలో పెట్టడంతో దళితులందరూ ముకుమ్మడిగా కాంగ్రెస్ పార్టీకి ఓట్లువేసి గెలిపించినట్లు చెప్పారు. దళితుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే అంబేద్కర్ అభయహస్తం పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కుక్కల సుధ, సీహెచ్.రాధ, గాడిపెల్లి వెంకన్న, చెవిటి రాధ, కందిపాటి నాగరాజు, చాగంటి రవి, రాజేందర్, రాజు, వీరన్న, ఎల్లయ్య, క్రాంతి, కన్నయ్య, భాస్కర్, సత్యబాలు, బాలరాజు, సంధ్య, మాధవి, మంగమ్మ, కీర్తన, దయా, లక్ష్మి, స్వరూప, జలేంద్ర, సరస్వతి, యమున, రజిత పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ

నేర నియంత్రణపై నిఘా..

మరిపెడ, సీఐ రాజ్‌కుమార్‌గౌడ్



ఆంధ్రజ్యోతి : నేర నియంత్రణపై మరిపెడ సర్కిల్ పరిధిలో ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

సీఐ : ఇప్పటికే సర్కిల్ పరిధిలోని అన్ని పోలీస్‌స్టేషన్లలోని పాత నేరస్తులకు కౌన్సిలింగ్ ఇచ్చాం. సస్పెక్టెడ్ గ్రామాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం.

ఆంధ్రజ్యోతి : బెల్లం, ఇసుక రవాణా, పీడీఎస్ బియ్యం దందాలను ఎంత వరకు అరికట్టారు?

సీఐ : ఇప్పటికే మరిపెడ సర్కిల్ పరిధిలోని అన్ని గ్రామాల్లో బెల్లం, ఇసుక రవాణా, పీడీఎస్ బియ్యం దందా చేసే వారికి హెచ్చరికలు జారీ చేశాం. అక్రమదందాలు చేసే వారు ఎంతటివారైనా వదిలేదిలేదు. ఇప్పటికే పలువురు అక్రమదారులపై పలు కేసులు పెట్టాం. రెవెన్యూ అధికారులను కోఆర్డినేషన్ చేసుకొని ఇసుక రవాణా నివారణపై ప్రత్యేక టీంలు పని చేస్తున్నాయి.

ఆంధ్రజ్యోతి : సైబర్ క్రైమ్, డ్రగ్స్ నియంత్రణపై ఏం చర్యలు తీసుకుంటున్నారు?

సీఐ : మొన్నటికి మొన్న 62 కిలోల గంజాయి పట్టుకొని నిందితులను జైలుకు పంపించాం. మరిపెడ సర్కిల్ పరిధిలో ఏడు సైబర్‌క్రైం కేసులు నమోదు అయ్యాయి. డబ్బులు కూడా నేరగాళ్ల నుంచి బాధితులకు రికవరీ చేసి ఇచ్చాం.

ఆంధ్రజ్యోతి : ప్రజలతో పోలీసులకు ప్రజా సంబంధాలు ఎలా ఉన్నాయి?

సీఐ : ప్రజలకు మూఢనమ్మకాలపై కళాజాత బృందాలతో అవగాహన కలిపిస్తున్నాం. గ్రామాల్లో నేరాలు ఘోరాలపై ప్రజలకు వివరిస్తూ అందుకు పడే శిక్షలపై చైతన్య పరుస్తున్నాం.

- మరిపెడ, (ఆంధ్రజ్యోతి)

అన్నివర్గాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

(5వ పేజీ తరువాయి)

మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందని, కావాలనే బీఆర్‌ఎస్ నాయకులు రాద్ధాంతం చేస్తు న్నారన్నారు. గత ప్రభుత్వం రోడ్లకు, గ్రానైట్ భూములకు రియల్‌ఎస్టేట్ భూములకు రైతు బంధు ఇచ్చి, ధనం వృథా చేసిందన్నారు. త్వరలోనే రైతులకు రైతుభరోసా అందించడానికి సర్కారు కసరత్తు చేస్తుందని తెలిపారు. ఇందిరమ్మ కమిటీలు ఉన్నప్పటికి గ్రామస్తుల సమక్షంలో లబ్ధిదారులను ఎంపిక చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీలో కష్టపడిన వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను గ్రామాలలో వివరించాలన్నారు. తహసీల్దార్ రాజు, గిర్దావర్ అబ్దుల్ రహమాన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గొల్లపెల్లి ప్రభాకర్, ఎదళ్ల యాదవరెడ్డి, నాయిని సత్యపాల్‌రెడ్డి, కాసం లక్ష్మారెడ్డి, బాలాజీనాయక్, రావుల సతీష్, పట్నంశెట్టి నాగరాజు, జిలుకర యాలాద్రి, సైదులు, యాక సాయిలు, మౌనేందర్, పులి వెంకన్న, సలుగు హనుమంతు, రాజేష్, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

బేతోలులో విద్యుత్ అధికారుల పొలం బాట



రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యుత్ డీఈ విజయ్

మహబూబాబాద్ రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం శివారు బేతోలు గ్రామంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో శనివారం పొలం బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ డీఈ విజయ్ మాట్లాడుతూ విద్యుత్ వినియోగం, ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. ప్రతి రైతు విద్యుత్ మోటార్లకు కెపాసిటర్‌లను అమర్చుకోవాలని, ఎర్త్ కన్వెన్షన్ చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ బావుల వద్ద ఆటోమెటిక్ స్టార్టర్ల వినియోగంతో ట్రాన్స్‌ఫార్మర్లపై ఒకే సారి అధికలోడు పడడంతో అవి కాలపోయే ప్రమాదముందన్నారు. అధికారులు రాజ్యం, ప్రశాంత్, రవీందర్‌రెడ్డి, వీరాచారి, వివేక్, సత్యనారాయణ, సంతోష్, రఘు, రైతులు పాల్గొన్నారు.

కార్పొరేట్ శక్తులకు దేశ సంపద : సీపీఎం

బయ్యారం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : దేశ సంపదను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతుందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు సోమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ విమర్శించారు. బయ్యారంలో శనివారం సీపీఎం 9వ మండల మహాసభ జరిగింది. ఈమహాసభకు హజరైన వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉన్నత వర్గాలకు, పెట్టుబడిదారులకు అనుకూలమైన నిర్ణయాలు చేస్తూ పేదల పొట్టలు కొడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు పర్చకుండా ప్రజల దృష్టికి మళ్లించేందుకు హైడ్రా లాంటి కార్యక్రమాలను ముందుకు తీసుకొస్తుందన్నారు. ఈ మహాసభలో నాయకులు సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు రాజన్న, ఉపేందర్, మధు, శ్రీను, సత్యవతి, చంటి, విజయ, వెంకన్న పాల్గొన్నారు.

సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు స్థలాల పరిశీలన

తొర్రూరు రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : సోలార్ విద్యుత్ వినియోగంలోకి తీసుకురావడానికి ప్రభుత్వం తీసుకున్న సోలార్ ప్లాంట్ల ఏర్పాటు కోసం డీఆర్డీఏ, రెవెన్యూ, విద్యుత్‌శాఖ, దేవాదాయ శాఖ అధికారులు స్థలాలను శనివారం పరిశీలించారు. ఈ మేరకు ఆర్డీవో నర్సింహరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు దేవాదాయ భూముల్లో సోలార్ ప్లాంట్లను ఏర్పాటుకై తొర్రూరు మండలం మాటేడు గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయం, మరిపెడ మండలం అబ్బాయపాలెం అగస్త్రీశ్వరస్వామి దేవాలయం గ్రామాల్లోని దేవాలయాల స్థలాలను పరిశీలించినట్లు తెలిపారు. తద్వారా దేవాలదాయ భూములకు ఆదాయం రావడంతో పాటు విద్యుత్ వినియోగం అందుబాటులోకి వస్తుందన్నారు. విద్యుత్, దేవాదాయ శాఖ మధ్య ఒప్పంద కుదుర్చుకొని ఏర్పాటు చేస్తారన్నారు. ఇప్పటి వరకు అనువైన స్థలాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఈ పరిశీలనలో డీఆర్డీఏ పీడీ మధుసూదన్‌రాజు, టీఎస్‌రెడ్‌కోం జిల్లా అధికారి మహేందర్ రెడ్డి, విద్యుత్ డీఈ మధుసూదన్, తహసీల్దార్ శ్రీనివాస్, దేవాదాయశాఖ అధికారి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు ఏర్పాటు చేయాలి

జిల్లా సీడబ్ల్యూసీ చైర్మన్ నాగవాణి

తొర్రూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని కోరుతూ జిల్లా సీడబ్ల్యూసీ చైర్మన్ నాగవాణి శనివారం హైదరాబాద్‌లో రాష్ట్ర విద్యాకమిషన్ చైర్మన్ ఆకునూరి మురళికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల ఏర్పాటు లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తాగునీరు, వాష్‌రూమ్‌లు లేకపోవడం, స్కావెంజర్లు లేకపోవడంతో ఉపాధ్యాయులే పాఠశాలలను శుభ్రపరుచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని, మౌలిక వసతుల ఏర్పాటుకై తగు చర్యలు తీసుకోవాలని కోరామని తెలిపారు.

కార్మికులకు వేతనాలను విడుదల చేయాలి : టీయూసీఐ

తొర్రూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికుల వేతనాలు వెంటనే విడుదల చేయాలని ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ (టీయూసీఐ) జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి అన్నారు. శనివారం తొర్రూరులో జరిగిన జనరల్ బాడీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడుతూ పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు ఐదు నెలలుగా వేతనాలు ఇవ్వడంలేదన్నారు. అనంతరం 13 మందితో మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుండాల సోమ నర్సయ్య, ఉపాధ్యక్షుడిగా టి.యాకయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎ.బుచ్చిలింగం, మరికొందరిని కమిటీ సభ్యులుగా ఎంపిక చేశారు. నాయకులు యాకయ్య, సురేష్, యాదగిరి, బీకూ, దేవేందర్, వంశీ ఉన్నారు.

సీఎం సహాయనిధి బాధితులకు వరం

కురవి, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి) : సీఎం సహాయనిధి బాధితులకు వరంలాంటిదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంబటి వీరభద్రం అన్నారు. నల్లెల్లలో శనివారం రూ.13.95 లక్షల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కాంగ్రెస్ పాలనలో నిరుపేదకు న్యాయం జరుగుతుందని వీరభద్రం పేర్కొన్నారు. హేమలత, మహేష్, అనిల్, శ్రీధర్ పాల్గొన్నారు.

క్రీడా పోటీలకు ఆశ్రమ పాఠశాల విద్యార్థులు

మహబూబాబాద్ రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఐటీడీఏ ఏటూరునాగారంలో ఈనెల 29, 30న జరిగే జిల్లాస్థాయి కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలకు మహబూబాబాద్ మండలం రెడ్యాల ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత బాలుర పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం సక్రునాయక్, పీడీ మోహన్‌నాయక్‌లు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గత 16,17 తేదీల్లో రెడ్యాల గిరిజన ఆశ్రమ పాఠశాలలో జరిగిన డివిజన్‌స్థాయి బాలబాలికల పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచి సుమారు 40 మంది విద్యార్థులు వివిధ క్రీడల్లో జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయ బృందం వెంకన్న, లక్ష్మీదేవి, రాజు, సుదర్శన్, సంధ్యారాణి, శారద, లక్ష్మయ్య, హన్మంతు, అరుణ్, రమేష్‌లు అభినందించారు.

మహా పాదయాత్రను సక్సెస్ చేయాలి

గూడూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ మాల మహనాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ చేస్తున్న మాలల మహాపాదయాత్ర విజయవంతం చేయాలని ఆ సంఘం జాతీయ కార్యదర్శి ఆశోద భాస్కర్ పిలుపునిచ్చారు. గూడూరులో మహాపాదయాత్ర పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. మాల మహానాడు నాయకులు చీదురు వెంకన్న, బెజ్జం రమేష్, సింగుడాల కొమ్మాలు, సదయ్య, లక్ష్మీనారాయణ, యాదగిరి, ఉపేందర్, సతీష్, వీరస్వామి, సుధాకర్, రఘు పాల్గొన్నారు.